## సీఎం ఓఎస్‌డీ రాజశేఖర్‌రెడ్డికి

# మాతృవియోగం

■ అంత్యక్రియలకు హాజరైన ప్రముఖులు


రామాయంపేట, అక్టోబర్ 16: సీఎం ప్రత్యేక కార్యదర్శి పెంటపర్తి రాజశేఖర్‌రెడ్డి మాతృమూర్తి రత్నమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లోని దవాఖానకు వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సోమవారం దివంగత పెంటపర్తి రత్నమ్మ (80) పార్థీవదేహాన్ని మెదక్ జిల్లా రామాయంపేట మండలం డి.ధర్మారం గ్రామంలోని వారి స్వగృహానికి తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి కలిసి రత్నమ్మ భర్త పెంటపర్తి లక్ష్మారెడ్డి, కుమారుడు రాజశేఖర్‌రెడ్డి, వారి కుటుంబాన్ని పరామర్శించారు. రత్నమ్మ పార్థీవదేహానికి పుష్పగుచ్ఛాలు సమర్పించి, నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, సీఎం ఓఎస్‌డీ స్మితా సబర్వాల్, ఐజీ కమలాసన్‌రెడ్డితోపాటు పలువురు అధికారులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. చుట్టుపక్కల గ్రామాల వారు భారీ సంఖ్యలో డి.ధర్మారం చేరుకుని రత్నమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



రాజశేఖర్‌రెడ్డి మాతృమూర్తి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కేటీఆర్



సీఎం కేసీఆర్ స్పెషల్ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి కేటీఆర్



దివంగత పెంటపర్తి రత్నమ్మ పార్థీవ దేహానికి పూలమాల వేస్తున్న మంత్రి హరీశ్‌రావు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న మెదక్ జిల్లా బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి



దివంగత రత్నమ్మ కుమారుడుని ఓదారుస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

# త్వరగా ప్రారంభించాలి

- గౌరవెల్లి రిజర్వాయర్ పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణలో వక్తలు
- పర్యావరణ పరిరక్షణ, మత్స్య సంపద పెంపు కోసం ప్రభుత్వం నిధులు కేటాయించింది
- సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

హుస్నాబాద్, అక్టోబర్ 16: గౌరవెల్లి రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంతోపాటు హుస్నాబాద్ ప్రాంతానికి ఎంతో ఉపయోగపడే ప్రాజెక్టును త్వరగా ప్రారంభించాలని పలువురు వక్తలు కోరారు. సోమవారం హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామ శివారులోని శుభం గార్డెన్స్‌లో గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణంతో పర్యావరణంపై పడుతున్న ప్రభావంపై పర్యావరణ, అటవీశాఖ అధికారుల సమక్షంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పాతక్ ఆధ్వర్యంలో పలువురు నిర్వాసితులు, రిజర్వాయర్ పరిధిలోని పలు మండలాల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణంతో ఎలాంటి అటవీ సంపదగాని, అడవి జంతువులకు నష్టం వాటిల్లదన్నారు. రిజర్వాయర్‌తో గుడాటిపల్లి, ఇతర గ్రామాల ప్రజలు నిర్వాసితులయ్యారని, వారికి సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. హుస్నాబాద్ నియోజకవర్గంతోపాటు నల్లగొండ, వరంగల్ జిల్లాలకూ సాగు నీరందించే గౌరవెల్లి రిజర్వాయర్ దాదాపుగా పూర్తయినందున రైతులు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే ప్రారంభించాలని అధికారులను కోరారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణంతో పర్యావరణ పరిరక్షణ, మత్స్య సంపద పెంపు, పునరావాసం కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. రిజర్వాయర్ పరిధిలో వీలైనన్ని మొక్కలు నాటడం, గ్రీనరీని పెంచడంతో పర్యావరణాన్ని కాపాడొచ్చన్నారు. సమావేశంలో నీటి పారుదల శాఖ ఈఈ రాములునాయక్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నిర్వాసితులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

# సీఎం కేసీఆర్ సభకు పటిష్ట బందోబస్తు



మాట్లాడుతున్న సీపీ శ్వేత, పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 16: సిద్దిపేట జిల్లా కేంద్రంలో నేడు జరుగనున్న ప్రగతి ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు సీఎం కేసీఆర్ హాజరవుతున్నందున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. సోమవారం సిద్దిపేట పట్టణ శివారులోని నంద్యాల వెంకటలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో పోలీస్ అధికారులు, సిబ్బందికి సీపీ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. సభకు వచ్చే ప్రజలు, ప్రజాప్రతినిధులు విధి నిర్వహణలో ఉండే పోలీసుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు పార్కు చేయాలని, రోడ్డుకు అడ్డదిడ్డంగా పెట్టొదని తెలిపారు. అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బందితో 6 సెక్టార్లుగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నాగదేవత చౌరస్తా నుంచి, పెద్దమ్మ టెంపుల్ చౌరస్తా నుంచి వచ్చే వాహనదారులు సభాస్థలి ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో పార్కు చేసుకుని సభాస్థలికి చేరుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీలు అందె శ్రీనివాసరావు, మల్లారెడ్డి, రాంచంద్రారావు, సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు సురేందర్‌రెడ్డి, రమేశ్, చంద్రశేఖర్, రవీందర్‌రాజు, సతీశ్, సీఐలు కృష్ణారెడ్డి, రవికుమార్, భానుప్రకాశ్, చేరాలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్లు**

→ నేటి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు ట్రాఫిక్ డైవర్షన్ చేస్తున్నారు. → నాగదేవత టెంపుల్ చౌరస్తా, బైపాస్ రోడ్డు నుంచి సిరిసిల్ల వెళ్లే వాహనదారులు సిద్దిపేట పట్టణం లేదా సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా నుంచి వెళ్లాలి. → పెద్దమ్మ టెంపుల్ చౌరస్తా బైపాస్ రోడ్డు నుంచి నాగదేవత టెంపుల్ చౌరస్తాకు వచ్చే వాహనదారులు ఎల్లమ్మటెంపుల్ ఎక్స్‌రోడ్, వేములవాడ కమాన్ నుంచి సిద్దిపేటకు వెళ్లాలి.

# ఆయుధ రక్షణ పరిశ్రమలో ఎన్‌సీసీ క్యాడెట్లు

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 16: గజ్వేల్ బాలుర హబ్‌లో కొనసాగుతున్న జాతీయ స్థాయి ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ క్యాంపులో భాగంగా వివిధ రాష్ట్రాలకు చెందినవారు సోమవారం ఆయుధ రక్షణ పరిశ్రమను సందర్శించినట్లు క్యాంపు కమాండెంట్ కల్నల్ సునీల్ అబ్రహం తెలిపారు. ఈ పర్యటనలో సంగారెడ్డి జిల్లా ఎద్దుమైలారం ఆర్డినెన్స్ పరిశ్రమ సీనియర్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్యాడెట్లకు యుద్ధనౌకలు, ఫిరంగులు, సబ్‌మెరైన్ల నిర్మాణం, పనిచేయు విధానం, తయారీలో ఉండే మూడు దశలు బాడీ బిల్డింగ్, అసెంబ్లింగ్, ట్రయలింగ్ గురించి వివరించారు. అన్ని రాష్ట్రాలకు చెందిన 303 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, 20 మంది అధికారులు ఫ్యాక్టరీని సందర్శించారని లెఫ్ట్‌నెంట్ కల్నల్ పినాకి తెలిపారు. క్యాడెట్లకు సాంస్కృతిక పోటీలు నిర్వహించినట్లు డిప్యూటీ కమాండెంట్ కల్నల్ పీఎస్ నందా తెలిపారు. బాలుర హబ్‌లో కొనసాగుతున్న శిక్షణలో సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో ఉమ్మడి క్యాంపులో 150 మంది క్యాడెట్లు సోమవారం రాజగోపాల్‌పేట వద్ద ఫైరింగ్ రేంజ్ వద్ద ఫైరింగ్, మిగతా క్యాడెట్లు సిమ్యులేటర్ ఫైరింగ్‌లో పాల్గొన్నట్లు క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావు తెలిపారు.



ఎద్దుమైలారం వద్ద ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని సందర్శించిన వివిధ రాష్ట్రాల ఎన్‌సిసి క్యాడేట్లు

# ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు షురూ

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 16: సంగారెడ్డి జిల్లాలో 2022-23 సంవత్సరానికి ఓపెన్ స్కూల్ ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్ కోర్సుల సప్లిమెంటరీ థియరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తెలుగు, హిందీ, ఉర్దూ పరీక్షలకు మొత్తం 152 మంది అభ్యాసకులకు 112 మంది 74 శాతం హాజరయ్యారు. ఎస్‌ఎస్‌సీ తెలుగు పరీక్షకు 73 మంది అభ్యాసకులకు 53 మంది 73 శాతం హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఇంటర్మీడియట్ అరబిక్ పరీక్షకు మొత్తం 42 మందికి 32 మంది 76 శాతం హాజరయ్యారు. సంగారెడ్డిలోని జడ్పీహెచ్‌ఎస్ (బాలికల) కేంద్రంలో ఎస్‌ఎస్‌సీ, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించారు. ఆయా పరీక్షా కేంద్రాలను డీఈవో ఎస్.వెంకటేశ్వర్లు సందర్శించారు.